క్లుప్తంగా

దోపిడీకి విఫలయత్నం



కారు వద్ద దోపిడీకి యత్నిస్తున్న దుండగులు

పావగడ: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చళ్లకెర క్రాస్ వద్ద ఆగి ఉన్న కారును దోపిడీ చేసేందుకు ఓ ముఠా యత్నించి విఫలమైంది. బాధితుడు గోవర్ధన్ వివరాల మేరకు.. బెంగళూరు నుంచి పావగడ మీదుగా స్వగ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యలో చళ్లకెర క్రాస్ వద్ద విశ్రాంతి కోసం కారు ఆపి వెనుక సీట్లో నిద్ర పోయినట్లు చెప్పారు. సోమవారం తెల్లవారుజామున 4.15 నిమిషాల సమయంలో బైకుపై వచ్చిన ముగ్గురు దుండగులు కారు డోరు గ్లాసును తీసి దోపిడీకి ప్రయత్నించినట్లు చెప్పారు. అందులో ఒకరు వెనుక సీట్లో ఉన్న తనకు తుపాకీ గురి పెట్టాడన్నారు. అతన్ని కాలితో తన్నడంతో ఆ వెంటనే దొంగలు అలర్ట్ అయి బైకులో పరారైనట్లు చెప్పారు. దొంగలు మాస్క్‌లు ధరించారని, తెలుగులో మాట్లాడారని పేర్కొన్నారు. అంతలో పెట్రోలింగ్ పోలీసులు అక్కడికి చేరుకుని దుండగులను గాలించగా అప్పటికే వారు పరారైనట్లు చెప్పారు. ఈ దృశ్యాలన్నీ ఓ షాప్‌కు చెందిన సీసీ కెమెరాలో నిక్షిప్తమైనట్లు పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా పోలీసులు దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



గంగిరెడ్డి (ఫైల్)

లేపాక్షి: మండల పరిధిలోని కుర్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బయన్నగారి గంగిరెడ్డి (80) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతునికి భార్యతో పాటు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానిక సర్పంచ్ ఆదినారాయణ, జెడ్పీటీసీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, నాయకులు బోర్ల అంజినరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి కుర్లపల్లికి చేరుకొని గంగిరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

రహదారులకు పేర్ల మార్పు సరికాదు

హిందూపురం: పట్టణంలో పలు ముఖ్య రహదారుల పేర్లను మార్చేలా మున్సిపల్ కౌన్సిల్ అజెండాలో పొందుపరచడం సరికాదని విశ్వ హిందూ పరిషత్, హిందూ సంఘాల నాయకులు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌లకు వినతిపత్రాలను అందజేశారు.

రామనాథరావుకు కృష్ణదేవరాయ అవార్డు



కృష్ణదేవరాయ అవార్డును స్వీకరిస్తున్న రామనాథరావు

చిలమత్తూరు: మండలంలోని దేమకేతేపల్లికి చెందిన రామనాథరావుకు కృష్ణదేవరాయ అవార్డు దక్కింది. సోమవారం కర్ణాటకలోని హంపీలో అవార్డును అందజేసినట్లు రామనాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. జ్యోతిష్యంతో పాటు జానపద, పౌరాణిక నాటికల ద్వారా కళాకారులకు ప్రోత్సాహం అందిస్తూ సమాజంలో చైతన్యం తీసుకురావడంతో సిటిజన్ వెల్ఫేర్ ఫోరం, ఫ్రెడ్ ఇండియా కల్చరల్ సంయుక్తంగా ఈ అవార్డును అందజేశాయన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

పెనుకొండ: పట్టణంలోని నగర పంచాయితీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమీషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు.



ఉష్ణోగ్రత సమాచారం
(గరిష్ఠం)

హిందూపురం	37.0
పెనుకొండ	41.0
మడకశిర	37.0

ఆల్‌ఫ్రీ బాబు మాటలు నమ్మొద్దు

- ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఏకైక సీఎం జగన్
- బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే తిప్పేస్వామి



మడకశిర: బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, పార్టీ శ్రేణులు

మడకశిర: ఆల్ ఫ్రీ చంద్రబాబును నమ్మి మరోసారి మోసపోవద్దని స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలో సోమవారం ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. మొదట మిట్టబండ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ర్యాలీని ప్రారంభించారు. తర్వాత వైఎస్సార్ సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను 98.5 శాతం నెరవేర్చారని పేర్కొన్నారు. నాలుగేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అందించారన్నారు. వైఎస్ జగన్ పేదల పక్షపాతిగా పని చేయడంతోనే పేదలకు పక్కాగా సంక్షేమ పథకాలు అందాయన్నారు. చంద్రబాబు మహానాడులో ప్రకటించిన ఎన్నికల హామీలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. గతంలో ప్రజలకు 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు .. ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆల్‌ఫ్రీ చంద్రబాబు మరోసారి ప్రజలను మోసం చేయడానికి అనేక హామీలతో ముందుకు వస్తున్నారని తెలిపారు. చంద్రబాబు హామీలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్ని హామీలు ఇచ్చినా చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్ప వద్దని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

పరిగి: మండల కేంద్రంలోని సీతారామ్‌పురం కాలనీలో కొద్ది రోజులుగా నీటి సమస్య ఉంది. నిరుపయోగంగా ఉన్న బోరుబావిని వినియోగంలోకి తీసుకొస్తే సమస్య పరిష్కారమవుతుందని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ సర్పంచ్ లక్ష్మీదేవికి సూచించారు. దీంతో దాదాపు లక్ష రూపాయల నిధులను వెచ్చించి సోమవారం నిరుపయోగంగా ఉన్న బోరు బావికి పంపు, మోటారు సెట్టుతో పాటూ పైపులు, వైరును అమర్చి వినియోగంలోకి తేవడంతో సమస్య పరిష్కారమైంది.

స్పందనకు అధికారుల డుమ్మా

సోమందేపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో అర్జీదారులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక వెనుదిరిగారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ నారాయణరెడ్డి, ఎంఈఓ ఆంజనేయులునాయక్, ఏపీఎం రామాంజనేయులు తప్ప ఇతర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. తహసీల్దార్ బదిలీపై వెళ్లగా ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న సౌజన్య లక్ష్మి పరిగిలో ఉండటంతో 1బి, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందక ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

జూదరుల అరెస్టు



పట్టుబడిన జూదరులతో ఎస్‌ఐ నరేంద్ర , సిబ్బంది

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి చెరువు సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం కొడిగెనహళ్లి చెరువు పరిసర ప్రాంతంలో సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించామన్నారు. ఈ క్రమంలో ఓ రహస్య ప్రాంతంలో పేకాట ఆడుతున్న జూదరులపై దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఐదుగురుని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి రూ.2,500 ను స్వాధీనం చేసున్నట్లు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరిచామన్నారు.

దారి సమస్య పరిష్కరిస్తాం

- సబ్‌కలెక్టర్ కార్తీక్



సబ్‌కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

పెనుకొండ: తమ భూములకు దారి చూపాలని రైతులు వేడుకోగానే స్పందించిన సబ్ కలెక్టర్ కార్తీక్ వెంటనే రైతుల దారి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ స్వర్ణలతకు ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని శెట్టిపల్లికి చెందిన రైతులు సర్వేనంబర్ 325లో రైతులకు 1000 ఎకరాల భూమి ఉందని, ప్రతి యేటా ఈ భూముల్లో వర్షాధారపు పంటలు సాగు చేసుకుని రైతన్నలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అయితే కొందరు రైతులు ప్రస్తుతం దారికి అడ్డు తగులుతుండటంతో భూముల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. వందలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. టీడీపీకి చెందిన బట్టా గోవిందమ్మ అనే మహిళా రైతుతో పాటు మరికొందరు టీడీపీ నాయకులు రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన సబ్‌కలెక్టర్ వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పోతన్న, సాయినాయక్, చిన్నపోతన్న, ఆదిశేషు, నాగేష్, నాగప్ప, నారాయణమ్మ, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే జగనన్న ధ్యేయం



విత్తన వేరుశనగ బస్తాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



ఆర్ అనంతపురంలో విత్తన పంపిణీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

పెనుకొండ: రైతు సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం సబ్సిడీ విత్తన వేరుశెనగ పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటున్నారన్నారు. వారితో పాటు రైతన్న కుటుంబాల్లోని ప్రతి మహిళ, కుమారులు, కుమార్తెలకు వివిధ పథకాల కింద లబ్ధి చేకూరుస్తున్నారని పేర్కొన్నారు. 40 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగను అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఎకరాకు 3 బస్తాలు ఇస్తున్నారని, 30 కిలోల బ్యాగు పూర్తి ధర రూ. 2,790 కాగా సబ్సిడీతో రూ.1674 అందిస్తున్నట్లు చెప్పారు. అధికారులు రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి సకాలంలో విత్తన వేరుశనగ అందించాలన్నారు. అనంతరం పలువురు మహిళా రైతులకు ఎమ్మెల్యే విత్తన వేరుశనగను అందించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరుబాబు, టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండలరాయుడు, ఎంపీడీఓ శివశంకరప్ప, ఏడీ స్వయంప్రభ, ఏఈ సురేంద్ర నాయక్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మడకశిరరూరల్: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. సోమవారం ఆర్ అనంతపురం పంచాయతీ కేంద్రంలోని ఆర్బీకేలో వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో రైతులు విత్తన కాయల కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, మండల కేంద్రానికి వచ్చి గంటల తరబడి క్యూలో ఉండే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. అయితే సీఎం జగన్ ఆధ్వర్యంలో ఆర్బీకేలు ఏర్పాటు చేయడంతో గ్రామస్థాయిలోనే విత్తన కాయలను పంపిణీ చేయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజినమ్మ , ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, వైస్ ఎంపీపీ మూర్తి,తాలుకా బీసీ సెల్ నాయకులు తిమ్మప్ప, వెంకటేష్, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు బాబిరెడ్డి, ఏడీఏ కృష్ణమీనన్, ఏఓ వీరనరేష్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని 15 ఆర్‌బీకేలో సోమవారం విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఏఓ మంజునాథ్ మాట్లాడుతూ మండలానికి ఇంకా రెండు వేల క్వింటాళ్ల విత్తన కాయలు రావాల్సి ఉందని, అందరికీ విత్తనకాయలు అందిస్తామన్నారు. ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యులు స్వారక్క, నరసింహమూర్తి, సర్పంచ్ భాగ్యమ్మ, ఎంపీటీసీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని వ్యవసాయ గోదాములో సోమవారం వేరుశనగ విత్తన కాయల పంపిణీని ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ సభ్యులు పాలే జరాంనాయక్ అధికారులతో కలసి ప్రారంభించారు. డివిజనల్ వ్యవసాయ అధికారి అల్తాఫ్‌ఖాన్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ రఘునాథగుప్తా తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండల కేంద్రలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. రైతులందరికీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని ఏఓ నివేదిత చెప్పారు. కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఎంపీపీ చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ రూప, వైస్ ఎంపీపీ హరితాలక్ష్మి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, ఏఈఓ అంజాద్, రైతులు పాల్గొన్నారు.

రొళ్ల: మండలంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీని సోమవారం ప్రారంభించారు. మొదటిరోజు బీజీ హళ్లి, హులికుంట, రత్నగిరి, దొడ్డేరి, హొట్టేబెట్ట, మల్లినమడుగుల్లోని ఆర్బీకే కేంద్రాల్లో 457 మంది రైతులకు గాను 400 క్వింటాళ్ల విత్తన కాయలను పంపిణీ చేశారు.

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి



వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



వలంటీర్లను సత్కరిస్తున్న నాయకులు

మడకశిర: వలంటీర్లు ప్రభుత్వానికి మంచి పేరుతీసుకువచ్చేలా పనిచేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి సూచించారు. సోమవారం మడకశిర మున్సిపాలిటీ, మడకశిర రూరల్ మండలంలో సేవా వజ్ర,సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు పొందినన వలంటీర్లను స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు వలంటీర్లను అనేక రకాలుగా అవమానించారని , అయినా కూడా వలంటీర్లు కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో వలంటీర్లకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, వైస్ ఎంపీపీలు నరసింహమూర్తి, శ్రీరామిరెడ్డి, ఎంపీడీఓ సోనిబాయి, కమిషనర్ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని కోడిపల్లి గ్రామంలో సోమవారం ఉదయం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మంజునాథ్ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడంతో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. ఉత్తమ వలంటీర్లను సన్మానించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆనంద్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శంకరరెడ్డి, కే.శ్రీనివాసరెడ్డి, అరుణ, వలంటీర్లు పాల్గొన్నారు.



జ్యోతులను మోస్తున్న మహిళలు

వైభవంగా జ్యోతుల ఉత్సవం

మడకశిరరూరల్: మండల పరిధిలోని మణూరు గ్రామంలో వెలిసిన ఆంజనేయస్వామికి సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు.

జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి స్వామి వారికి సమర్పించారు. మంగళవారం మారెమ్మ దేవతకు జ్యోతుల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రజలు తెలిపారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ఎస్ఎస్‌వైవీఎన్ పాఠశాలలో నెల రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ సోమవారంతో ముగిసింది. కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సు నేర్పించామని, ఉత్తీర్ణులైన 680 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు 'నాలుగేళ్ల సంబరాలు'

పెనుకొండ: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం సంబరాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, పట్టణ కన్వీనర్ బోయ నరసింహ తెలిపారు. మంగళవారం ఉదయం 9:30 గంటలకు ఎమ్మెల్యే శంకరనారాయణ స్వగృహంలో కేక్ కటింగ్ ఉంటుందన్నారు. అనంతరం మడకశిర రోడ్డులో ఉన్న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. పెద్ద ఎత్తున బైక్ ర్యాలీని కూడా నిర్వహిస్తున్నామని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

పెనుకొండ రూరల్: మండలంలోని రైతు భరోసా కేంద్రాలల్లో నేటి నుంచి వేరుశనగ విత్తన కాయలు అందుబాటులో ఉంటాయని మండల వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్ తెలిపారు. కావాల్సిన రైతులు తమ పాస్ బుక్, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కే6 రకం 30 కేజీల ఒక బస్తా ధర రూ.2,790 కాగా, ప్రభుత్వం సబ్సిడీతో రూ.1674 కే అందిస్తోందన్నారు. మంగళవారం నుంచి అన్ని ఆర్బీకేల్లో విత్తనకాయలు అందుబాటులో ఉంటాయన్నారు.

ఎమ్మెల్యే వెంకటేశ్‌కు ఘనస్వాగతం



ఎమ్మెల్యే వెంకటేశ్‌ను అభినందిస్తున్న నాయకులు

పావగడ: రాష్ట్ర కేబినెట్ మంత్రుల ప్రమాణ స్వీకార అనంతరం తొలిసారిగా పావగడకు వచ్చిన ఎమ్మెల్యే వెంకటేశ్‌కు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం ఘన స్వాగతం పలికారు. ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాలన్నీ నెరవేరుస్తామని వెంకటేష్ తెలిపారు. పావగడను అభివృద్ధి పథంలో తీసుకెళ్తానన్నారు. అనంతరం ఆయన పట్టణంలోని గుట్టహళ్లి ప్రాంతంలో ఇల్లు దగ్ధం కావడంతో సర్వం కోల్పోయిన బాధితురాలు మహేశ్వరికి ఆర్థికసాయం అందించారు.

ఏఓ నరసింహమూర్తికి పదోన్నతి

మడకశిర: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న నరసింహమూర్తికి ఎంపీడీఓగా పదోన్నతి లభించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆయన్ను అనంతపురం జిల్లాకు కేటాయించినట్లు పేర్కొన్నారు. పదోన్నతి పొందిన నరసింహమూర్తిని అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

నేడు జ్యోతుల ఉత్సవం

రొళ్ల: మండలం పరిధిలోని కొడగార్లగుట్ట గ్రామ సరిహద్దు ప్రాంతం కర్ణాటక రాష్ట్రం జీడీ పాళ్యం గ్రామంలో మంగళవారం రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మ వారికి జ్యోతుల ఉత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా సోమవారం సాయంత్రమే స్వగ్రామానికి తీసుకువచ్చి పట్టం కూర్చోబెట్టారు.

వర్గీకరణతో న్యాయం చేయండి

పెనుకొండ: ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించి అందులోని మాదిగ ఉపకులాలకు జనాభా ప్రాతిపదికన న్యాయం చేయాలని ఎంఈఎఫ్ నాయకులు తెలిపారు. నాయకులు ఎంఈఎఫ్ నేత శ్రీనివాసులు, జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సాకేత్ మధుసూదన్ తదితరులు సమావేశమయ్యారు. సమావేశంలో నాయకులు రవి శంకర్, నాగభూషణం, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

డీపీకి ఫెన్సింగ్ ఏర్పాటు చేయండి

హిందూపురం టౌన్: పట్టణంలోని 28వ వార్డు కోట ఏరియాలోని రాఘవేంద్రస్వామి ఆలయం ఎదురుగా ఉన్న డీపీకి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని వార్డు కౌన్సిలర్ మల్లికార్జున కోరారు. ఈ మేరకు సోమవారం ట్రాన్స్‌కో కార్యాలయంలో ట్రాన్స్‌కో ఏఈ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు.